

శ్రీవారి లడ్డూ కల్తీపై నేతల ఆందోళనలు

జగన్,వైవీ,భూమన దిష్టిబొమ్మల దహనం

ఆగ్రహావేశాలు

శ్రీవారి భక్తులు పవిత్ర ప్రసాదంగా భావించే లడ్డూను అపవిత్రం చేశారంటూ తిరుపతిలో శనివారం ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు ఆందోళనలు చేపట్టారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినదించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ , టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బా రెడ్డి, భూమన కరుణాకర రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.వారిని అరెస్టు చేయాలని బీజేపీ నేతలు, జనసేన నేతలు ఎస్పీ సుబ్బరాయుడికి వినతిపత్రాలు అందజేశారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

అఖండ దీపానికీ అదే నెయ్యి వాడారా?

'కల్తీ నెయ్యిని లడ్డూ ప్రసాదాల్లో వినియోగించడమే కాకుండా శ్రీవారి మూలవిరాట్ ముందు అఖండ దీపానికి వినియోగించి ఉంటే దానిపైనా విచారణ జరగాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాలి' అని కూటమి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు , పులివర్తి నాని, మురళీ మోహన్ , గురజాల జగన్మోహన్ డిమాండు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.శనివారం తిరుపతిలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. లడ్డూ నాణ్యత తగ్గిందని పవన్ కల్యాణ్ గతంలోనే చెప్పారని జంగాలపల్లి శ్రీనివాసులు అన్నారు. అన్యమతస్తులు కొండపై చేరి సర్వనాశనం చేశారని, అయితే దేవుడి శిక్షనుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. స్వయం ప్రకటిత మేధావి కరుణాకర రెడ్డి ఏమీ ఎరగనట్టు ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.తిరుమలను కూడా వైసీపీ వారు సొంత అవసరాలకు వాడుకున్నారని పులివర్తి నాని ఆరోపించారు. ఈ వ్యవహారంలో జగన్‌కు అత్యంత సన్నిహితుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ప్రమేయమూ ఉందని ఆరోపించారు. ఆల్ఫా కంపెనీకి 2లక్షల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా కాంట్రాక్టు ఇచ్చారంటే కమీషన్లకు కక్కుర్తిపడే ఆ పనిచేశారని ఎవరికైనా అర్థమైపోతుందన్నారు. ఆధ్యాత్మికతనం వంటినిండా పులుముకుని కనిపించే చెవిరెడ్డి ఇప్పుడు ఎక్కడికి పోయారో తెలియడంలేదన్నారు.తిరుమలలో అపచారం జరిగిందని నిరూపిస్తే డైవర్షన్ రాజకీయాలంటారా? వైసీపీవే వక్రబుద్ధి రాజకీయాలని మురళీ మోహన్ విమర్శించారు. ఆలయాన్ని వైసీపీ కార్యాలయం లాగా మార్చుకున్నారని పేర్కొన్నారు. లడ్డూ కల్తీపై చర్చకు, ప్రమాణానికి సిద్ధమా అని నారా లోకేశ్ సవాల్ విసిరితే తప్పు చేయకపోతే కోర్టును ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో టీటీడీని కూడా వైసీపీ నేతలు భ్రష్టుపట్టించారని గురజాల జగన్మోహన్ అన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి ప్రసాదాన్ని కలుషితం చేశారని దుయ్యబట్టారు. తప్పు చేసిన వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా వదిలే ప్రసక్తే లేదన్నారు.



బీజేపీ నిరసన





జనసేన నిరసన



కల్తీ నెయ్యిపై దర్యాప్తు చేపట్టాలి

శ్రీవారి లడ్డూల్లో వినియోగించిన కల్తీ నెయ్యి అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. నెయ్యిలో కల్తీ జరగడంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో శ్రీవారి పరకామణిలో జరిగిన దోపిడీ గురించి కూడా విచారణ చేయమని గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. ఈ కుట్రలో అప్పటి ఈవో ధర్మారెడ్డి, ఛైర్మన్ కరుణాకర రెడ్డి, విజిలెన్స్, పోలీసు అధికారులు ఉన్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశంలోనూ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం.

\- తిరుమలలో ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



బాధ్యులను అరెస్టు చేయాలి

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి హిందువుల మనోభావాలకు గండి కొట్టిన మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలను అరెస్టు చేయాలని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. జనసేన నాయకులతో కలిసి ఆయన శనివారం లడ్డూ, వడ చేతిలో పెట్టుకుని నిరసన తెలిపారు. తిరుమల పవిత్రతను, ప్రసాదాన్ని అపవిత్రం చేసి నీతులు వల్లించడం జగన్ రెడ్డికే చెల్లుతుందన్నారు. తిరుమల ఆలయాన్నిపోటును సంప్రోక్షణ చేయాలని కోరారు. ఈ మేరకు ఎస్పీ సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు.



కల్తీ నెయ్యితో రూ.కోట్లు దోచుకున్నారు

కల్తీ నెయ్యితో స్వామి వారికి నైవేద్యాలు చేయించి, రూ.కోట్లు దోచుకున్న మాజీ సీఎం జగన్, మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలు కాలగర్భంలో కలసిపోతారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి దుయ్యబట్టారు. ఈ వ్యవహారంలో బాధ్యులను అరెస్టు చేయాలని బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, మునిసుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేశారు. హిందువుల ఆరాధ్య దైవం తిరుమలను ఐదేళ్లలో అపవిత్రం చేసి ఇష్టానుసారంగా దోచుకున్నారని, ల్యాబ్ నివేదిక బయటపెట్టడంతో అవినీతికి పాల్పడిన అధికారులు, ఛైర్మన్లు తడుముకుంటున్నారన్నారు. క్రిస్టియన్ మిషనరీలతో చేతులు కలిపి తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా జగన్ ప్రవర్తించారని ఆరోపించారు.



దోషులు తప్పించుకోలేరు

కలియుగ దైవం వెంకన్న దృష్టి నుంచి దోషులెవరూ తప్పించుకోలేరు. తిరుమలలో ఏమీ జరగలేదని, చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని జగన్‌రెడ్డి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. శ్రీవాణి ట్రస్టు నిధులు మాయం, అగ్నిప్రమాదంలో కొన్ని ఫైళ్ల దగ్ధం కావడం నిజం కాదా? కల్తీ నెయ్యి విషయమై శ్రీవారి భక్తుల్లో అలజడి రేపిన ఘనత జగన్‌రెడ్డికి దక్కింది.

\-నరసింహాయాదవ్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు



సీబీఐ విచారణ చేయాలి

పవిత్రమైన లడ్డూను అపవిత్రం చేసిన అంశంపై సీబీఐతో విచారణ జరిపించి, దోషులను శిక్షించాలి. రీటెండరింగ్ విధానంతో రూ.320కే కిలో నెయ్యి కొన్నామని ప్రగల్భాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి, ధర్మారెడ్డి ఇప్పుడు సమాధానం చెప్పాలి. గత ఐదేళ్లలో నిత్యం కొండపై శిలువ గుర్తులు, కాఫీ కప్పులు, గంజాయి అమ్మకాలు సాగాయి. జే బ్రాండ్ మద్యం తరహాలో జగన్ బ్రాండ్ నెయ్యి తెచ్చారు.

\- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే



భక్తులకు ధర్మారెడ్డి సమాధానం చెప్పాలి

కమీషన్ల కోసం హిందువుల మనోభావాలను దెబ్బతీసిన అప్పటి ఈవో ధర్మారెడ్డి సమాధానం చెప్పాలి. ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇవ్వాలి. సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. వైసీపీ పాలనలో ధర్మకర్తల మండలి డమ్మీగా మారింది.

\- నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత



నేటితో ముగియనున్న

బదిలీల గడువు

● రాజకీయ సిఫార్సులతో జిల్లా యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21: ఉద్యోగుల బదిలీలకు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తొలి విడతగా బదిలీల జాబితాను తయారు చేసింది. విద్య, వైద్య, వ్యవసాయ అనుబంధ శాఖల్లో మినహా మిగిలిన 15 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. వాస్తవానికి ఈనెల 15వ తేదీకల్లా ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగిసింది. అయితే భారీ వర్షాలు, వరదల కారణంగా ఉద్యోగులంతా విజయవాడ తరలివెళ్లడంతో బదిలీలను వాయిదా వేసింది. చివరికి ఆదివారం నాటికి బదిలీల ప్రక్రియకు తుది గడువు ప్రకటించింది. ఈ క్రమంలో సిఫారసు లేఖలతో అధికారులపై ఒత్తిడి చేస్తూ కోరుకున్న చోటు దక్కించుకునేందుకు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లాపరిషత్, డీఆర్‌డీఏ, డ్వామా, ఇంజనీరింగ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం తమదైన శైలిలో పైరవీలు ప్రారంభించారు. శనివారం రాత్రి పొద్దుపోయే వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల బదిలీల ప్రక్రియపై అధికారులు కసరత్తు చేశారు. జిల్లాలో 34 మండలాలకు సంబంధించి వీఆర్వో, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల జాబితా సిద్ధమైంది. ఆదివారం సాయంత్రానికల్లా రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు అధికారికంగా వెలువడనున్నాయి. గ్రేడ్ 1, గ్రేడ్2, గ్రేడ్3, గ్రేడ్4 పంచాయతీ కార్యదర్శులకు వారి సీనియార్టీని బట్టి 450 పంచాయతీలకు పైగా నూతన పోస్టింగ్ ఇవ్వనున్నారు. చంద్రగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లో మేజర్ పంచాయతీ కార్యదర్శి పోస్టులకు విపరీతమైన పోటీ నెలకొంది. 'మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల నుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో వచ్చిన ఆర్డీవోలు (ఎస్‌డీసీ) సైతం ఇప్పటికీ జిల్లాలో కొనసాగుతున్నారు. వారి బదిలీలు కూడా ఆదివారం నాటికి రానున్నాయి. మిగిలిన శాఖల్లో కూడా బదిలీల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన ఈ బదిలీలు జరుగనున్నాయి.

జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ బదిలీ

తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల అధికారి ఇ.ప్రతాప్ బదిలీ అయ్యారు. పరిశ్రమల శాఖలో జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన ఆయన కొత్త జిల్లాల ఆవిర్భావం నుంచీ తిరుపతి జిల్లా పరిశ్రమల అధికారిగా కొనసాగుతున్నారు. తాజాగా ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా ఆయన ఏలూరు జిల్లా పరిశ్రమల అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు. కాగా గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూడా పనిచేసిన ప్రతాప్ చురుకైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

ఓను....

వాళ్లిద్దరూ రాజీపడ్డారు!

● కొత్త మలుపు తిరిగిన ఆదిమూలం కేసు

సత్యవేడు, సెప్టెంబరు 21: లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెండైన టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కేసు కొత్త మలుపు తిరిగింది. తనను ఎమ్మెల్యే ఆదిమూలం పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేసి,అత్యాచారానికి పాల్పడ్డారని అందుకు సంబంధించిన వీడియో టేపులను మీడియాకు విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన కేవీబీపురం మండలానికి చెందిన బాధిత మహిళ చివరకు ఆయనతో రాజీ పడినట్లు సమాచారం.తనను ఎమ్మెల్యే ఆదిమూలం లైంగికంగా వేధించాడని తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిన ఆమె శుక్రవారం హైకోర్టుకు హాజరై ఎమ్మెల్యేపై తాను పెట్టిన కేసు, అందులో పేర్కొన్న ఆరోపణలు అవాస్తవమని నివేదించడం గమనార్హం. తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆదిమూలం తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు.ఆదిమూలంపై పోలీసులు పెట్టిన కేసులో సెక్షన్లు వర్తించవని, మహిళా పోలీసు అధికారిణి నమోదు చేయాల్సిన కేసును పురుష పోలీసు అధికారి నమోదు చేశారని,జూలై, ఆగస్టునెలల్లో సంఘటన జరిగితే సెప్టెంబరు 5న కేసు నమోదు చేశారని ఆయన కోర్టుకు వివరించారు. ఇదిలా ఉండగా మూడవ వ్యక్తి ప్రమేయంతోనే మహిళ కేసు పెట్టిందని,ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని కేసును కొట్టి వేయాలని కోరారు. మరోవైపు బాధిత మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అంశాలన్నీ అవాస్తవమని, ఈ మేరకు నోటరీతో కూడిన అఫిడవిట్‌ను బాధిత మహిళ కోర్టుకు సమర్పించిందని, అందువల్ల ఈ కేసును కొట్టి వేయాలని మహిళ తరఫు న్యాయవాది జితేందర్ సైతం కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృష్ణసాగర్ తీర్పును ఈ నెల 25వ తేదీకి రిజర్వ్ చేశారు. అంతవరకు ఈ కేసులో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సంచలనం కలిగించిన ఈ కేసులో బాధిత మహిళ యూటర్న్ తీసుకుని ఎమ్మెల్యేతో రాజీ కుదుర్చుకోవడం వెనుక నియోజకవర్గంలో అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. రాజీ కుదిర్చేందుకు ఐదు రోజులుగా విజయవాడలో సుదీర్ఘ మంతనాలు జరిగినట్లు సమాచారం.

సస్పెన్షన్ ఎత్తివేతపై చర్చ

ఎమ్మెల్యే ఆదిమూలంపై టీడీపీ అధిష్ఠానం వేసిన సస్పెన్షన్ వేటు ఉంటుందా కొనసాగుతుందా అన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. ఈ నెల 5న ఆదిమూలంపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో ఏబీఎన్‌లో ప్రసారమైన వార్తలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు ఆదేశాలతో గంటల వ్యవధిలోనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలో వరద సహాయక చర్యల్లో రాత్రింబవళ్ళు నిమగ్నమైన చంద్రబాబు, ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని సస్పెన్షన్‌కు చర్యలు తీసుకున్నారు. టీడీపీలో ఇలాంటి క్రమశిక్షణరాహిత్య చర్యలకు తావుండదని సస్పెన్షన్‌తో పార్టీ క్యాడర్‌ను పరోక్షంగా హెచ్చరించారు. అయితే ప్రస్తుతం ఆదిమూలం కేసు కోర్టులో వీగిపోతే ఆయన సస్పెన్షన్‌ను తొలగిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.



శనీశ్వర సన్నిధానం స్వర్ణమయం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: ముక్కంటి ఆలయంలోని శనీశ్వరస్వామి సన్నిధానం స్వర్ణమయమైంది. హైదరాబాదుకు చెందిన వ్యాపారవేత్తలు మనోజ్, మహేష్‌రెడ్డి సొంత నిధులతో స్వర్ణతాపడం పనులు చేయించారు. స్వర్ణమయమైన తర్వాత తొలిసారి పూజలను శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా దాతలు స్వామివారికి అలంకరించే పీఠం, తోరణంతో పాటు వివిధ స్వర్ణతాపడంతో తయారు చేసిన పూజా సామగ్రిని అందజేశారు. అర్చకులు సన్నిధిని శుద్ధిచేసిన అనంతరం సంకల్ప పూజలతో శనీశ్వరమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. వారు జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి స్వర్ణ తాపడం తోరణం అందజేస్తున్న దాతలు



స్వర్ణ తాపడం చేసిన శనీశ్వరస్వామి సన్నిధానం



తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం శ్రీకాళహస్తి ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్ తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పుత్తూరులో పెట్రోలు బంకు ఏర్పాటుకు సంబంధించి ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న శీను అనే వ్యక్తిని లంచం పేరిట వేధించారన్న ఆరోపణలపై తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న ఆ పోస్టులో ప్రభుత్వం రెగ్యులర్ ఆర్డీవోను నియమించే వరకూ శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

మూడిళ్లలో చోరీ

448 గ్రాముల బంగారు నగలు, 7.5 కిలోల వెండి, రూ.11 లక్షల నగదు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21: తిరుపతి రూరల్ మండలం తిరుమల నగర్‌లో దొంగలు చెలరేగిపోయారు. ఏకకాలంలో మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఎమ్మార్‌పల్లి సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాలివి.. తిరుమల నగర్ మొదటి వీధిలోని ఎన్.నాగరాజు శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఇంటి పైభాగంలో పడుకున్నాడు. ఉదయం లేచి చేసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బెడ్‌రూము బీరువాలో సుమారు 420 గ్రాముల బంగారు ఆభరణాలు, 800 గ్రాముల వెండి వస్తువులు, రూ.11 లక్షల నగదు కనిపించలేదు. వెంటనే తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణం, డీఎస్పీ ప్రసాద్,సీఐ చిన్నగోవిందు వచ్చి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. అలాగే టెలిఫోన్ కాలనీకి చెందిన జి.సురేష్ కుటుంబం విజయవాడకు వెళ్లింది. ఈ విషయాన్ని పసిగట్టిన దొంగలు అతని ఇంట్లో ఆరు కిలోల వెండి వస్తువులు అపహరించారు. టీటీడీలో పనిచేస్తున్న వెంకటరమణ కుటుంబంతో బయటకు వెళ్లారు. వారి ఇంట్లో కూడా దొంగలు చొరబడి 25 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



చోరీ జరిగిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 73,104 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,330 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం నీతి ఆయోగ్ మెంబర్ విజయ్‌కుమార్ సరస్వత్, తెలంగాణ ఐజీ చారు సిన్హా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి

భాకరాపేట, సెప్టెంబరు 21: శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు అపచారం జరగడంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లులో వారు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల నూనె కలిసిందంటే అది క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకుమార్, మోహన్‌రెడ్డి, జయచంద్ర, చెంగయ్య, సురేంద్ర నాయడు, గుర్రప్ప నాయుడు, శేఖర గౌడ్, రఫీ, చోటా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మైచెరువుపల్లెలో నేడు ఎమ్మెల్యే నాని పర్యటన

భాకరాపేట, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి తెలిపారు. మండలంలోని నెల్లుట్లవారిపల్లె పంచాయతీ బొమ్మైచెరువుపల్లె సచివాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు



నేంద్రగుంట వద్ద జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఆర్టీవో, పోలీసు అధికారులు

పాకాల, సెప్టెంబరు 21: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు ఆర్టీవో, పోలీసు అధికారులు తెలిపారు. పాకాల మండల పరిధిలోని జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను శనివారం ఆర్టీవో శ్రీనివాసరావు, సీఐలు మద్దయ్య ఆచారి (పాకాల), సుబ్బరామరెడ్డి (చంద్రగిరి), నేషనల్ హైవే అథారిటీ సూపర్‌వైజర్ సురేష్ పరిశీలించారు. ప్రమాదాలకు గల కారణాలను చర్చించారు. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు, బ్లింకర్స్, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని కోరారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీవారి కీర్తనలు ఆలపిస్తున్న మహిళా మండలి సభ్యులు

పాకాల, సెప్టెంబరు 21: పాకాల మండలం నేంద్రగుంట వెంకటేశ్వర స్వామి ఆలయంలో పెరటాసి మాసం మొదటి శనివారం (తిరుమల శనివారం) సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవర్లకు విశేషమైన అలంకరణలు చేశారు. సాయంత్రం పాకాల వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం మహిళా మండలి సభ్యులు ఆలయంలో విష్ణు సహస్రనామం, గోవింద నామావళి, సహస్ర నామ పారాయణం, శ్రీవారి కీర్తనలు ఆలపించారు.

నేడు శిల్పారామంలో మెష్ ఫ్యాషన్ షో

తిరుచానూరు, సెప్టెంబరు 21: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం సాంప్రదాయ వస్త్రధారణ మెష్ ఫ్యాషన్‌షో నిర్వహిస్తున్నట్లు ఈవో ఖాదరవల్లి, విన్నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్ డైరెక్టర్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విన్నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 6గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి ఆధునిక యుగంలో పూర్తిస్థాయిలో ఫ్యాషన్‌పై మక్కువతో మన సాంప్రదాయాన్ని మరచిపోతున్న యువతకు గుర్తు చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముందస్తుగా ఈ షోను నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేందర్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

భక్తులతో కిటకిటలాడిన కల్యాణ వెంకన్న ఆలయం

తిరుచ్చి వాహనంపై దర్శనమిచ్చిన స్వామి అమ్మవార్లు



క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు



తిరుచ్చి వాహనంపై స్వామి అమ్మవార్లు

చంద్రగిరి, సెప్టెంబరు 21: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపారాధన చేశారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అధికారులు వెంకటస్వామి, రమేష్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వరి, మామిడి పంటలపై రైతులకు శిక్షణ

చంద్రగిరి, సెప్టెంబరు 21: చంద్రగిరి వ్యవసాయ కార్యాలయంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వరి, మామిడి, ఉద్యాన పంటలలో మేలైన సాంకేతిక యాజమాన్య పద్ధతులపై శనివారం రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులందరూ ఎక్కువ డిమాండ్, అధిక ఆదాయం కలిగిన ప్రత్యామ్నాయ పంటలు, చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని కోరారు. ఈకార్యక్రమంలో డీఆర్సీ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, మండల ఉద్యాన అధికారి శైలజ, రైతులు పాల్గొన్నారు.

కళత్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

వరదయ్యపాళెం, సెప్టెంబరు 21: మండలంలోని కళత్తూరు పంచాయతీ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ తెప్పల బాలయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు పీడీ శ్రీనివాసప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారని ఏపీవో గణేష్ తెలిపారు. వివిధ కంపెనీల్లో విధులకు వెళుతున్న 28మంది కార్మికుల పేరిట పనులు చేసినట్లు మస్టర్లు సృష్టించి నిధులు దుర్వినియోగం చేశారని అదే గ్రామానికి చెందిన నాగరాజు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. గత ఆగస్టు 23న ఏపీడీ, స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో విచారణాధికారుల బృందం కళత్తూరులో గ్రామసభను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో అక్రమాలు నిజమేనని తేలింది. ఈ క్రమంలో ఆయన్ను సస్పెండ్ చేశారు. దీనిపై పదిరోజుల్లో వివరణ ఇవ్వాలని బాలయ్యకు నోటీసులు జారీ చేశారు.

3న ఖాళీ టిన్‌ల విక్రయానికి టెండర్ల ఆహ్వానం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌ల రేటు కాంట్రాక్ట్ కింద టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టీటీడీ వినియోగించిన ఈ ఖాళీ టిన్‌లు 2025 మార్చి వరకు సేకరించవచ్చు. ఇతర వివరాలకు 0877 2264429 నెంబరు ద్వారా టీటీడీ మార్కెటింగ్ విభాగాన్ని సంప్రదించవచ్చని టీటీడీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

సంక్షోభంలోనూ సంక్షేమానికి అగ్రాసనం

● 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే నాని



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 21: సంక్షోభంలోనూ వంద రోజుల్లో సంక్షేమం అందించి మంచి ప్రభుత్వమని ప్రజల చేత అనిపించుకుంటున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి గ్రామీణ మండలం ఉమ్మడి మంగళం సచివాలయం-2 వద్ద శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులు, కూటమిపక్ష నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలను నెరవేర్చారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో జలజీవన్ కింద ఇంటింటికీ తెలుగు గంగ నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలో ఆర్టీవో కార్యాలయం సమీపంలో అన్నాక్యాంటీన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో సర్వే ట్రైనింగ్ కాలేజీకి కేటాయించిన ప్రభుత్వభూమిని(దాదాపు 40ఎకరాలకు పైగా) రద్దు చేసి టిడ్కో ఇళ్లను నిర్మించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. గత ప్రభుత్వం ఉమ్మడి మంగళం పరిధిలోని దాదాపు 3వేల మందికి ఏర్పేడు సమీపంలోని చిందేపల్లె వద్ద ఇళ్లస్థలాలు కేటాయించిందన్నారు. అక్కడ రద్దు చేసి పక్కనే ఉన్న స్థలంలో ఇళ్లు నిర్మిస్తామనే హామీని నెరవేరుస్తానన్నారు. కార్యక్రమం అనంతరం సర్వే ట్రైనింగ్ కాలేజీకి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు.. ఈ సందర్భంగా పలువురు తమ ప్రాంత సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజనేయులు, ఈశ్వర్‌రెడ్డి, డాలర్ దివాకర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, స్థానిక నాయకులు ఈశ్వరయ్య, గోపీనాథ్, సురేష్‌నాయుడు, శ్రీనివాసులయాదవ్, మహేశ్వరి, చలపతి, భాస్కర్‌రెడ్డి, చిన్నరెడ్డిబాబు, నాగ, ధనలక్ష్మి, యువకిషోర్, సాయి, యువరాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సారె అందిస్తున్న ఎమ్మెల్యే నాని

మాది సంకీర్ణ ప్రభుత్వం

రామచంద్రాపురం, సెప్టెంబరు 21: ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా వంద రోజుల్లోపు 3 హామీలు అమలు చేశామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని కొత్త వేపకుప్పం పంచాయతీలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో సమస్యలన్నింటిని నాలుగేళ్లల్లో పూర్తిచేస్తామన్నారు. కూనేపల్లి గ్రామస్థుల కోరిక మేరకు గత వరదల్లో కొట్టుకుపోయిన వంతెన, శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వందరోజుల పాలనను వివరించి స్టిక్కర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీలు కేశవులు నాయుడు, బిందుమాధవి, జిల్లా నాయకులు జనార్ధన్ చౌదరి, జేడీ జగన్, హరిప్రసాద్, నరసింహారెడ్డి, డిల్లీనాథరెడ్డి, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా వేపకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార వారోత్సవాల్లో నాని పాల్గొని గర్భిణులకు సారె అందజేశారు.

రాయలచెరువును అభివృద్ధి చేస్తా

ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు రాయలచెరువును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని నాని అన్నారు. శనివారం రాయలచెరువును అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు.

ఎక్కడున్నావు ధర్మయ్యా...?

● టీటీడీ మాజీ ఈవోకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రశ్న



హేమాంబరధరరావు

చంద్రగిరి, సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో జరిగిన ఘోరం పట్ల ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి భక్తులు చింతిస్తుంటే వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తానై వ్యవహరించిన టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి ఎక్కడయ్యా అంటూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తిరుమలలో జరిగిన అపచారం పట్ల ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తులు బాధ పడుతుంటే అప్పుడు ముఖ్య అధికారిగా పెత్తనం చెలాయించిన ధర్మారెడ్డి మాత్రం స్పందించకపోవడానికి కారణం నెయ్యి సప్లయర్ నుంచి ముడుపులు తీసుకున్నందుకేనని ఆరోపించారు. లేదా తిరుమలను అపవిత్రం చేసినందుకే దాక్కున్నారా అని హేమాంబరధరరావు నిలదీశారు. దీనిపై భక్తులు చింతిస్తుంటే మాజీ సీఎం జగన్ మూర్ఖపు మాటలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. స్వామి కైంకర్యాలు నిర్వహించడంలో, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ ఇలాంటి పనులు చేసి ఉంటారని అనిపిస్తుందని ఆరోపించారు. క్యూలైన్లో చెప్పులతో ప్రవేశించిన జగన్ ఇప్పుడు అయ్యో మన వేంకటేశ్వరస్వామి అని అమాయక మాటలు మాట్లాడుతూ ఇంకా ప్రజలను మాయ చేయాలని చేసే ప్రయత్నం నెరవేరదని, ఆయన నీచపు బుద్ధులు ప్రజలు, భక్తులు తెలుసుకునే వైసీపీని తరిమి కొట్టారని అన్నారు. కానీ దేవుడికి చేసిన అన్యాయానికి పెద్ద శిక్ష అనుభవిస్తాడని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించి జగన్మోహన్‌రెడ్డిని, ధర్మారెడ్డిని, కరుణాకర్‌రెడ్డిని, వీళ్లందరికీ సన్నిహితంగా మెలిగి తన రాజకీయ ఎదుగుదలకు తిరుమల శ్రీవారిని వాడుకొన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, ఇందులో ప్రమేయమున్న ప్రతి అధికారిని అదుపులోకి తీసుకుని విచారించి శిక్షించాలని హేమాంబరధరరావు డిమాండ్ చేశారు.

తిరుమల బాలాజీనగర్‌లో కార్డన్‌సెర్చ్

● 32 వాహనాల సీజ్, 15 మంది బైండోవర్

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో పోలీస్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది శనివారం తిరుమలలోని బాలాజీనగర్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో నాకాబందీ నిర్వహించారు. తిరుమల పోలీసు, టీటీడీ విజిలెన్స్, రెవెన్యూ, ఫైర్, ఫారెస్ట్, ఎక్సైజ్, బీడీ టీం, డాగ్‌స్క్వాడ్, సచివాలయ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. బాలాజీనగర్‌లోని ప్రతి ఇంటిలో నివాసముంటున్న వారి ఆధార్‌కార్డులను, వాహనాల పత్రాలను పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఎలాంటి గుర్తింపుకార్డులు లేకుండా ఉంటున్న 15 మందిని అదుపులోకి తీసుకుని విచారించడంతో పాటు బైండోవర్ చేశారు. సరైన పత్రాలు లేని 32 వాహనాలను సీజ్ చేశారు. ఈకార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌శేఖర్, సీఐలు విజయ్‌కుమార్, మురళీ మోహన్‌రావు, హరిప్రసాద్, శేషగిరిరావు, వీఎస్వో సురేంద్ర, ఏవీఎస్వోలు శివయ్య, గిరిధర్, శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.



స్థానికులను విచారిస్తున్న పోలీసులు

రాజకీయ లబ్ధికి ఉద్యోగులను బలి తీసుకోవద్దు : చింతా



కాంగ్రెస్ నేతల నిరసన

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 21 : పార్టీల ప్రయోజనాలకు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమల లడ్డూ అంశాన్ని వాడుకోవడం సరికాదని దీనిని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. స్థానిక టీటీడీ పరిపాలన భవనం ముందు ఆయన శనివారం కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ ఆర్థిక ప్రయోజనాల కోసం లడ్డును వాడుకుంటే మరోక పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం బాధాకరమన్నారు. పవిత్రమైన తిరుమల పవిత్రను, శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా శ్రీవారి ప్రసాధాన్ని రాజకీయ పార్టీలు వారి స్వలాభాల కోసం వాడుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ లబ్ధి కోసం టీటీడీ ఉద్యోగులను బలి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యార్లపల్లి గోపి, శాంతి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామికి వైభవంగా తిరుమంజనం



రామచంద్రాపురరం, సెప్టెంబరు 21: పెరటాసి నెల తొలి శనివారం సందర్భంగా భవానీ జలకంఠేశ్వర ఉపాలయంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం జరిగింది. తమిళనాడు రాష్ట్రం నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులు రాయల మండపానికి వందలాదిగా చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సాలగ్రామ వెంకటేశ్వరాలయంలో అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుచానూరు, సెప్టెంబరు 21: తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరంలో సాలగ్రామ వెంకటేశ్వరాలయంలో శనివారం పిత్రుపక్ష అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ సుబ్బరాయుడు భక్తులకు అన్నదానం చేశారు. నారదపీఠం వ్యవస్థాపకులు దినేష్, ఆలయ నిర్వహణ మండలి సభ్యులు సిందూరి వెంకయ్య, పంచవటి రాజశేఖర్, జీడీ నాయుడు, దీప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పుష్పపల్లకిపై శివపుత్రుడి విహారం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 21: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో శనివారం రాత్రి స్వామివారు పుష్ప పల్లకిపై విహరించారు. ఈ కార్యక్రమానికి భాగ్యలక్ష్మి, దివంగత మోహన్‌నాయుడు, వీటీ రాజన్ అండ్ బ్రదర్స్, రామనాథ నాయుడు, కీర్తిశేషులు రాజారెడ్డి జ్ఞాపకార్థం, కీర్తిశేషులు కృష్ణమ నాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు, నరసింహారెడ్డి అండ్ సన్స్, రాజారెడ్డి అండ్ కో, కీర్తిశేషులు శ్రీరాములరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేషయ్య నాయుడు అండ్ సన్స్ కుమరేంద్రచౌదరి, మనోహర్‌నాయుడు అండ్ బ్రదర్స్, ఆంజినేయులు నాయుడు అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం, చందనాలంకారన్ని చేశాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురాగానే అలంకార మండపంలో స్వామి వారి ఉత్సవర్లకు పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివారి ఉత్సవర్లను పుష్పపల్లకిపై ఆశీనులను చేసి, కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. పుష్పపల్లకి సందర్భంగా ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.పుష్పపల్లకి సేవను వీక్షించడానికి రాష్ట్రంనుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా వేలాదిగా భక్తులు కాణిపాకం క్షేత్రానికి విచ్చేశారు.స్వామి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కాణిపాకంలో కామధేను వాహన సేవను ఆదివారం నిర్వహించనున్నారు.



స్వర్ణ రథంపై ఊరేగుతున్న స్వామి వారు



పుష్పపల్లకిపై స్వామి వారు

ప్రజలు మెచ్చిన కూటమి ప్రభుత్వం



చిన్నగొట్టిగల్లులో టీడీపీ నాయకుల కరపత్రాల పంపిణీ

భాకరాపేట, సెప్టెంబరు 21: ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చిన్నగొట్టిగల్లు మండల టీడీపీ నేతలు అన్నారు. చిన్నగొట్టిగల్లులో శనివారం మండల కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ 100 రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, ఎంపీటీసీ విజయకుమారి, సర్పంచ్ మనోహర, కార్యదర్శి మదనమోహనరాజు, వీఆర్వో మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ నేతలు మోహన్‌రెడ్డి, శేఖర్ గౌడ్, హరినాథరెడ్డి, చోటాసాహెబ్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో ఘనంగా ఫ్రెషర్స్‌డే



తిరుపతిరూరల్, సెప్టెంబరు21: కరకంబాడీరోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో శనివారం ఫ్రెషర్స్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు నైపుణ్యాలపై విద్యార్థులు పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఛైర్మన్ ఎ.గంగిరెడ్డి, వైస్‌ఛైర్మన్ ప్రకాశ్, సెక్రటరీ ప్రదీప్, స్టూడెంట్స్ అఫైర్స్ కమిటీ డీన్ డాక్టర్ వి.మధురిమ, వివిధ విభాగాల హెడ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించుకుంటేనే మనుగడ



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 21: ప్రకృతిని పరిరక్షించుకుంటేనే మనిషి మనుగడ సాధ్యమని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అన్నారు. పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఎస్వీయూలో మొక్కలను నాటారు. అంతకు ముందు యూనివర్సిటీలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. చెట్లను పెంచడం ద్వారానే జీవుల మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ చంద్రాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ దామోదరం, డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పీఎంపీడబ్ల్యూఏ సాయం



మంత్రి లోకేష్‌కు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 21 : విజయవాడ వరద బాధితులకు ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీ ఎం పీ డ బ్ల్యూ ఏ) సంఘం నేతలు రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ఫెడరేషన్ డవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ జడపల్లి రుద్రయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌ను కలిసి ఈమేరకు చెక్కును అందజేశారు.కార్యక్రమంలో సంఘం నేతలు అజిత, పీవీ రమణ, నాగరాజు, జానకిరామ్‌రెడ్డి, జయశంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హరేకృష్ణ వీధి ఉత్సవం



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 21: ప్రపంచ హరేనామ వారోత్సవాలలో భాగంగా తిరుపతి ఇస్కాన్ కేంద్రంలో 17వ తేదీ నుంచి ప్రత్యేక వేడుకలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వనకు నగర వీధుల్లో హరినామ సంకీర్తన నిర్వహించారు. ఇస్కాన్ ఆలయం నుంచి భక్తులు సంకీర్తన గానం చేస్తూ అన్నారావు సర్కిల్, భవానినగర్, కోమలమ్మ సత్రం, చెన్నారెడ్డి కాలనీ ద్వారా తిరిగి ఇస్కాన్ ఆలయం చేరుకున్నారు.

బహుముఖ రంగాల్లో ఎస్వీయూ కృషి

70 వసంతాల వేడుకలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


ప్రసంగిస్తున్న శ్రీకాంత్, వేదికపై ఇన్‌చార్జి వీసీ అప్పారావు, భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 21: బహుముఖ రంగాల్లో ఎస్వీయూ విశేష కృషి చేసిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఎస్వీయూ 70 వసంతాల వేడుక సెనేట్ హాలులో శనివారం నిర్వహించారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తాను కూడా ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ చదువుకున్నట్టు చెప్పారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు వంటి గొప్ప పాలనాదక్షుడిని అందించిన చరిత్ర ఎస్వీయూ సొంతమన్నారు. ఇన్‌చార్జి వీసీ అప్పారావు మాట్లాడుతూ.. ఎంతో మంది సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, పారిశ్రామిక, రాజకీయ ప్రముఖులను దేశానికి అందించిన ఘనత ఎస్వీయూకు ఉందన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు. సీడీసీ డీన్ చంద్రాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళీధర్, కల్చరల్ కో-ఆర్డినేటర్లు వివేక్, కల్యాణ్‌లు మాట్లాడారు. రచయిత డాక్టర్ వీఆర్ రాసాని రాసిన 'కపిరి' నవలను ఆవిష్కరించారు.

ఎస్వీ జూపార్కుకు మినీ డబుల్ డెక్కర్ బస్సు



మంగళం, సెప్టెంబరు 21: ఎస్వీ జూపార్కుకు సందర్శకులకు డబుల్‌డెక్కర్ బస్సును అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే దీనిని అందుబాటులో ఉంచనున్నారు. చెన్నైకి చెందిన గ్రీన్‌వేస్ సంస్థ ఈ బస్సును సమకూర్చింది. దీని విలువ రూ.9.50లక్షలు. ఇందులో 13మంది ప్రయాణించవచ్చు. కింది భాగంలో పెద్దలు, పైభాగంలో చిన్నపిల్లలు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.50 రుసుం ఉంటుంది.

మహాధర్నా జయప్రదం చేయండి : బీఎస్పీ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల, జన గణన నిర్వహించాలని కోరుతూ తలపెట్టిన మహాధర్నా విజయవంతం చేయాలని బీఎస్పీ రీజినల్ కో-ఆర్డినేటర్ పి.గుర్రప్ప పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబరు 9న విజయవాడలో మహాధర్నా చేస్తామన్నారు. బీసీల జనాభా మేరకు నామినేటెడ్ పదవులు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పేరాల జయచంద్ర మాట్లాడుతూ బీసీల జనాభా శాతం తేల్చి చెప్పాలని, ఇందుకు కుల, జన గణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్, వేణుగోపాల్ రాజు, భాస్కర్‌గౌడు, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులకు ట్రస్ట్ బోర్డుల్లో అవకాశాలు కల్పించాలి


మాట్లాడుతున్న సాయిస్వామి

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 21: దేవాలయాలపై అనుభవమున్న వారికే ట్రస్టు బోర్డుల్లో స్థానం కల్పించాలని రాష్ట్రీయ బ్రహ్మణఫ్రంట్ జాతీయ కన్వీనర్ సాయిస్వామి కోరారు. శనివారం అయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కోట్లాది హిందువుల మనోభావాలు దేవాలయాలతో ముడిపడి ఉందన్నారు. ఆగమశాస్త్రం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఒకేసారి ఉదయం అర్చనలు, అభిషేకాలు, నిత్య వేదపఠనం జరగాలన్నారు. ప్రతి ఆలయానికీ వేద పాఠశాల అనుసంధానం చేయాలన్నారు. బొట్టు పెట్టు - గుడిమెట్టు ఎక్కు అని హిందువులు గుర్తించుకోవాలని కోరారు. ప్రసాద్, వెంకటరమణనాయుడు, ప్రసాద్, మధు, జయచంద్ర, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సామర్థ్యం తనిఖీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 21: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అలిపిరిలోని బాలాజీ బస్టాండులో ఆర్టీసీ బస్‌ల కండీషన్స్ చెకింగ్ ప్రారంభమైంది. కడప జోన్ ఈడీ చెంగల్‌రెడ్డి శనివారం ఇందుకు శ్రీకారం చుట్టారు. ఏటా బస్సులకు ఐదు దశల్లో నిర్వహణాసామర్థ్యాన్ని తనిఖీ చేస్తుంటారు. ఈ క్రమంలో ఇప్పటికే నాలుగు దశల్లో తనిఖీలు పూర్తయ్యాయి. చివరది బస్సు కండీషన్ ప్రారంభించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి లోపం బయటపడిన వెంటనే బస్సును వెనక్కి పంపేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ నరసింహులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుగంగ గేటువాల్వ్‌కు మరమ్మతులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 21: తిరుపతి గ్రామీణ మండలం శెట్టిపల్లె రైల్వేగేటుకు సమీపంలోని తెలుగు గంగ గేటువాల్వ్ వద్ద లీక కాకుండా మరమ్మతులు చేశారు. ఈ అంశంపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'కలుషితగంగ' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ వాటర్‌వర్క్స్ విభాగం గేటువాల్వ్‌కు మరమ్మతులు చేశారు. కొత్త పైపులను ఏర్పాటుచేశారు. గేటువాల్వ్‌కు చుట్టూ అడుగుభాగంలో బురదను తొలగించి సిమెంట్ కాంక్రీటును వేశారు.

సంకటహర చతుర్దశి వేడుకలు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 21: స్థానిక వినాయకసాగర్ వద్ద సంకల్ప వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సంకటహర చతుర్దశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సురేష్‌స్వామి, ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్, మురళి, వాసు, కృష్ణయ్య, నాదమునిరెడ్డి, విజయలక్ష్మి, శాంతి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఇది మంచి ప్రభుత్వం'


కరపత్రాల పంపిణీలో భువన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 21: సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ నేత భువన్ కుమార్‌రెడ్డి అన్నారు. 32వ డివిజన్ యాదవ వీధి, గిరిధర దాస్ కాలనీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల కరపత్రాలను అందజేశారు. గడప గడపకూ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు దేవరాజులు, చంద్ర,హరి, మహేష్, సచివాలయ అడ్మిన్ రమేష్, సుధ, కవిత, మునికుమారి, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్థసారథి భట్టాచార్యుల జయంతి


మాట్లాడుతున్న రాణీసదాశివమూర్తి

తిరుపతిరూరల్, సెప్టెంబరు21: ఎస్వీ వేదవర్సిటీలో వైఖానసాగమ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, వైఖానసాగమపండితుడు రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యుల జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధురైకి చెందిన వైఖానసాగమపండితుడు గోవిందరాజన్ మాట్లాడుతూ..వైఖానస గ్రంథసంపత్తి పరిరక్షణనకు పార్థసారథి భట్టాచార్యుల కృషి ఎనలేనిదన్నారు. తిరుమల వైఖానస దివ్య సిద్ధాంతవివర్ధినీ సభ అధ్యక్షుడు రాఘవదీక్షితులు మాట్లాడుతూ తిరుమలలో వైఖానస ఆశ్రమాన్ని నిర్మించడంతోపాటు ఎన్నో సంస్కరణలు చేపట్టారని గుర్తుచేశారు. పార్థసారథిభట్టాచార్యుల కుమారుడు, వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి, అకడమిక్‌డీన్ గోళి సుబ్రహ్మణ్యశర్మ, డీన్ డాక్టర్ కేహెచ్ రాజేష్‌కుమార్, పరాశరం భావనారాయణాచార్యులు, డాక్టర్ గంజాం రామకృష్ణ, డాక్టర్ ఎం.మణిదీప్‌కుమార్, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి అండర్ 14 జూడో పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 21: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస క్రీడా సముదయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి అండర్-14 జూడో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు బాబు, వసంతరాణి, వసంత ఈమేరకు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు తిరుపతి చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వీరికి వసతి కల్పించారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి.

నేడు ఘంటసాల ది గ్రేట్ బెన్‌ఫిట్ షో

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 21: ఘంటసాల జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన ఘంటసాల ది గ్రేట్ సినిమా బెన్‌ఫిట్‌షో ఆదివారం స్థానిక దేవేంద్ర థియేటర్‌లో వేస్తున్నట్లు నిర్మాత సీహెచ్ రామారావు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఘంటసాల బయోపిక్ ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. సినిమా విడుదలకు ముందుగా శ్రీవారి పాదాల చెంత తిరుపతిలో ఒక షో వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఘంటసాల అభిమానులు, తిరుపతి ప్రజలు సినిమా చూడాలని కోరారు. సుబ్రహ్మణ్యం, ఆదిశేషు, హరేకృష్ణ, ఎంఎం.రత్నం పాల్గొన్నారు.

ప్రసాదంలో కల్తీనెయ్యిపై నిరసనలు

గత వైసీపీ ప్రభుత్వ నేతలపై ఆగ్రహం



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసైనికులు - కాలూరుసర్కిల్‌లో జగన్ దిష్టిబొమ్మని దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు21: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీనెయ్యి వినియోగించి హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారంటూ తిరుపతి రూరల్ మండల టీడీపీ నేతలు మనోహర్‌చౌదరి, రవిచంద్రనాయుడు ఆరోపించారు. కాలూరు సర్కిల్ వద్ద శనివారం మాజీ సీఎం జగన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అంశంపై సీబీఐతో విచారించి దోషులని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రవి చంద్ర, శంకర్‌రెడ్డి, ప్రభు, షావలి, విజయ్, ముని, దొరస్వామి, ఇబ్రహీం, మురళి, రామదాసు యాదవ్, బాలయాదవ్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి(లీలామహల్): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశం వెలుగుచూడటంతో ప్రతి హిందువూ తలదించుకునే పరిస్థితి ఎదురైందని సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యుడు మధుబాబు పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో కిషోర్, కిరణ్, పవన్‌రాయల్, కృష్ణరాయల్, కరుణాకర్‌రెడ్డి, నిర్మలరాయల్, లీలారాయల్‌లు పాల్గొన్నారు. తిరుపతి అర్బన్: కల్తీ నెయ్యి బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలని జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని మహాత్మగాంధీ విగ్రహం వద్ద జన సైనికులు నిరసనకు దిగారు. జగన్, వైవీ.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిల దిష్టిబొమ్మలను ఊరేగించి దహనం చేశారు. జనసైనికులు వెంకటేశ్వర్లు, సుధాకర్, రాజేష్‌యాదవ్, శీనురాయల్, హరిశంకర్, సుభాషిణి, లక్ష్మి, అన్నారాజమోహన్, శ్రావన్, మణి తదితరులు పాల్గొన్నారు. తిరుపతి(లీలామహల్): ఘోర అపచారానికి కారకులైనవారిని శ్రీవారి ఆనంద నిలయంలో అడుగుపెట్టకుండా జీవితకాలం బహిష్కరించాలని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ డిమాండు చేశారు. నరసింహయాదవ్‌తో కలసి ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. టీటీడీలో జరిగినన్ని అవినీతి అక్రమాలతో జగన్‌కు సంబంధం ఉందన్నారు. ఆయన కనుసన్నల్లోనే తిరుమల తిరుపతిలో అన్ని రకాల దోపిడీ జరిగిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జయరాం, యశ్వంత్, సుబ్బుయాదవ్, శ్రీనివాసులు, ముని, చెంగయ్యయాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతిరూరల్: శ్రీవారి లడ్డు, ప్రసాదాల తయారీలో జంతువుల కొవ్వు కలసిన కల్తీనెయ్యిని వినియోగించడం అపచారమని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల ఖండించారు.

అన్ని రంగాల్లో ప్రగతి కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్

తిరుపతి, సెప్టెంబర్21(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్యలు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ప్రజావేదిక శనివారం ఆటోనగర్‌లో జరిగింది. వర్షాకాలం డ్రేనేజీ నీరు ఆటోనగర్‌లోకి వచ్చేస్తోందని, వీధి లైట్లు సరిగా పని చేయడం లేదని, మసీదుకు స్థలం కేటాయించాలని, ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించాలని పలువురు కోరారు. శెట్టిపల్లి భూ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. వంద రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేసిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఆటోనగర్ ప్రాంత సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. మరో మూడు నెలల్లో మరోసారి మీ ముందుకు వస్తామని ఆయన చెప్పారు. శెట్టిపల్లి భూ సమస్య తమ నాయకుల దృష్టిలో ఉందని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రజా ప్రతినిధులు, అధికారలు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రజావేదిక లక్ష్యమని తెలిపారు. వందరోజుల్లో ప్రభుత్వం ఏమి చేసింది వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరించి వారి సమస్యలను కనుక్కుని పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించడంతో పాటు స్టిక్కర్లను ఎమ్మెల్యే అంటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నరసింహయాదవ్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మెప్మా పీడీ రాధమ్మ, డీఈ విజయకుమార్ రెడ్డి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అలరించిన నగరసంకీర్తన

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 21: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం నగరసంకీర్తన నిర్వహించారు. పెరటాసి మాసం తొలి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బండ వీధి భజన గుడి నుంచి గోవింద రాజ స్వామి ఆలయం నాలుగు మాడవీధుల్లో నగరసంకీర్తన సంప్రదాయ రీతిలో నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, భక్తులు, గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్ వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

● మహిళా వైద్య సిబ్బంది వేడుకోలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 21 : మెడికల్ ఆఫీసర్ నుంచి రక్షణ కల్పించాలని కొందరు మహిళా సిబ్బంది కోరుతున్నారు. ఎర్రావారిపాళెం మండలం నెరబైలు పీహెచ్‌సీలోని మహిళా వైద్య సిబ్బంది కొందరు జిల్లా అధికారులకు ఈమేరకు ఫిర్యాదు చేశారు ఈ పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది ఉన్నారు. ఇద్దరు పురుష డాక్టర్లు, ఒక ఎంపీహెచ్‌ఈవో ఉన్నారు. మిగిలిన 13 మంది పారామెడికల్ సిబ్బందితోపాటు క్షేత్రస్థాయిలో ఐదుగులు ఏఎన్‌ఎంలు, ఐదుగురు ఎంఎల్‌హెచ్‌పీలు,10 మంది ఆశావర్కర్లు మహిళలే. పీహెచ్‌సీ ప్రధాన మెడికల్ ఆఫీసర్ తమను అసభ్యకర పద జాలాలతో దూషిస్తున్నారని, రాత్రి వేళ కూడా ఇదేతీరులో వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు పెడుతున్నారని బాధిత సిబ్బంది డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. అప్పుడప్పుడు విధులకు తాగి వచ్చి వేధిస్తున్నారన్నారు. ఇటీవల ఆయన జన్మదిన వేడుకలను పీహెచ్‌సీలోనే బలవంతంగా నిర్వహింపచేయించారన్నారు. ఈయన వైఖరితో ఇప్పటికే ఓ మహిళా ఎంఎల్‌హెచ్‌పీ రాజీనామా చేసిందన్నారు. రాజకీయ పలుకుబడి, ఉన్నతాధికారుల పరిచయాల వల్ల ఈయనపై ఫిర్యాదు చేయాలన్నా భయపడాల్సి వస్తుందన్నారు. ఈ అధికారి నుంచి రక్షణ కల్పించకపోతే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామన్నారు. సోమవారం లిఖితపూర్వకంగా కలెక్టరుకు, డీఎంహెచ్‌వోకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి శ్రీహరిని వివరణ కోరగా విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

చాక్లెట్ల ముసుగులో గంజాయి విక్రయం


గంజాయి ప్యాకెట్లు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 21: తిరుపతిలోని కిరాణా దుకాణంలో చాక్లెట్ల ముసుగులో విక్రయిస్తున్న దాదాపు రూ.86,350 విలువ కలిగిన 3200 గంజాయి ప్యాకెట్లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. కటికరంగడి వీధిలో ప్రొవిజన్ షాపులో గంజాయి మిశ్రమం కలిగిన చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ, పోలీసులు దుకాణంపై మెరుపు దాడి చేశారు. తిరుపతి రూరల్ గాంధీపురం పంచాయతీ శ్రీనగర్ కాలనీకు చెందిన బవర్‌లాల్ తులసీరాం షాపు నిర్వహిస్తున్నాడు. చిన్న చిన్న గోలీల రూపంలో గంజాయిని ప్లాస్టిక్ కవర్లలో పెట్టి విక్రయిస్తున్నట్లు బయటపడింది. అతడిని అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ, ఏఎస్ఐ షన్ముగం, హెడ్ కానిస్టేబుళ్ళు వెంకటేశ్వరరావు, రాము, కానిస్టేబుళ్ళు గోపీనాథ్, డిల్లేశ్వరరావులకు జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

2.5 కిలోల గంజాయి స్వాధీనం


తిరుపతిలోని బస్టాండు, శ్రీనివాసం, మాధవం అతిథి గృహాల వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఈస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రూ 50వేల విలువ చేసే 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి కథనం మేరకు... స్థానిక విష్ణునివాసం వద్ద పార్కింగ్ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. సీఐ, ఎస్ఐలు అక్కడ నిఘా ఉంచి అనంతపురం జిల్లా చిలమత్తూరుకు చెందిన పూల వెంకటేష్,స్థానిక పోస్టల్ కాలనీకి చెందిన మేరల గోవిందరాజులను అరెస్టు చేశారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఏచూరి జీవితం ఆదర్శనీయం


ప్రసంగిస్తున్న అరుణ్ కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 21: ఏచూరి సీతారాం జీవితం ఆదర్శనీయమని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు అరుణ్ కుమార్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో శనివారం నిర్వహించిన ఏచూరి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నయా ఉదారవాద, మతోన్మాద విధానాలపై విద్యార్థి దశ నుంచీ ఏచూరి ఉద్యమించారన్నారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు మాట్లాడుతూ.. పార్లమెంటు లోపల, బయట ప్రజా సమస్యలను ఏచూరి లేవనెత్తారన్నారు. ఇందుకే బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డును కూడా పొందారన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ దేశంలోని రాజకీయ నేతల్లో ఏచూరి ఎంతో ప్రత్యేకతను కలిగి ఉన్నారన్నారన్నారు. సీపీఎం నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళి,ఎస్ఎఫ్ఐ నేతలు మాధవ్, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, ఐద్వా నాయకురాలు సాయిలక్ష్మి, నాయకులు అక్బర్, వినోద్, అశోక్, తేజ, మధు, వీరేష్, గణేష్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వారికి 'మనోబంధు'


మనోబంధు అంబులెన్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21: మతిస్థిమితం లేని వారిని వైద్యశాలలకు తరలించి చికిత్సకు తోడ్పడుతున్న మనోబంధు ఫౌండేషన్ సేవలను అభినందనీయమని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రశంసించారు. ఫౌండేషన్ ఏర్పాటు అంబులెన్సును శనివారం తమ కార్యాలయం వద్ద ఆ సంస్థ నిర్వాహకుడు రామకృష్ణమరాజుతో కలిసి ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. రోడ్లపై మానసిక స్థితి సరిగాలేక తిరుగుతుంటే గుర్తించి తమకు ఫోన్(9866887299, 9246563738) చేస్తే అంబులెన్స్ ద్వారా సాయపడతామన్నారు. ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో 250 మంది రోగులను ఆరోగ్య వంతులుగా మార్చి కుటుంబాల చెంతకు చేర్చామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, మనోబంధు ఫౌండేషన్ సభ్యులు అంజయ్య, అరవ జయపల్, గోవిందు, న్యావాది సుబ్రహ్మణ్యం దామినేటి కేశవులు, నాగేంద్రలు పాల్గొన్నారు.

భక్తులు మెచ్చేలా పోలేరమ్మ జాతర

ప్రతి భక్తుడికీ అమ్మవారి దర్శనం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 21: వెంకటగిరి పోలేరమ్మ జాతరను భక్తులందరూ మెచ్చేవిధంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. స్థానిక పింజలవీరయ్య కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన శాంతి సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ జాతరకు రాష్ట్రమంతా గుర్తించేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 22వ తేదీ పోలేరమ్మ రాకను తెలియపరిచే ఘటోత్సవంతో జాతర ప్రారంభమై ఈనెల 26వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సాగుతుందన్నారు. 22న రాత్రి 7 గంటలకు పోలేరమ్మ దేవస్థానం ఆర్చి వద్ద మ్యూజికల్ నైట్, 23న సాయంత్ర 6 గంటలకు త్రిభువని సెంటరు నుంచి పోలేరమ్మ దేవస్థానం వరకు అమ్మవారికి భక్తులు, దాతల విరాళాలతో తయారు చేసిన అమ్మవారి బంగారు పాదుకల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు వెంకటేశ్వర ప్యాలెస్ సెంటరు నుంచి పోలేరమ్మ దేవస్థానం మీదుగా జగన్నాథపురం వారి కాంతారా బృందం నృత్య ప్రదర్శన, 25న సాయంత్రం 6 గంటలకు వెంకటేశ్వర ప్యాలెస్ నుంచి అమ్మవారి దేవస్థానం మీదుగా వరంగల్ వారి బోనాల కోలాటం, డ్రమ్స్ వాయిద్యాలు, పాతబస్టాండు సమీపంలో రాత్రి 8గంటలకు బాణసంచా ప్రదర్శన, జీనిగుల వారి వీధి నుంచి అమ్మవారి ఉత్సవంలో రాత్రి 1 గంటకు అమ్మవారి దేవస్థానం వరకు బొట్టుబొమ్మల ప్రదర్శన, 26వ తేదీ అమ్మవారి నిరూపోత్సవంతో జాతర ముగుస్తుందన్నారు. సమావేశానికి హాజరైన ప్రజలు జాతర నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, సీఐ రమణ, టీడీపీ నాయకుడు గంగోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి బంగారు పాదుకలకు దాతల విరాళం

అమ్మవారి బంగారు పదుకల తయారీకి పలువురు దాతలు విరాళాలు అందించారు. జీఎన్ఆర్ ట్రస్టు అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు రూ.లక్ష, గౌరీశంకర్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకుడు రూ.50వేల చెక్కు. పులికొల్లు రాజేశ్వరరావు చేతుల మీదుగా ఎమ్మెల్యేకి అందచేశారు. అలాగే డక్కిలి మండలం నాగవోలు గ్రామానికి చెందిన పోలి సురేష్ దంపతులు రూ.50,116 నగదు అందచేశారు.

పుత్తూరు వార్తలు

ఇది మంచి ప్రభుత్వం.. ఇది ప్రజల మాట: టీడీపీ



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 21: ప్రజల్లో అభద్రతాభావం తొలగించి, వంద రోజుల్లో ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు అనుకునే స్థాయిలో సంక్షేమ పథకాలు అందిజేసిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎంపీపీ, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గంజి మాదవయ్య తెలిపారు. శనివారం ఆయన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా తడకు పంచాయితీలో ఇంటింటా కరపత్రాలను అందజేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను, రాబోయే రోజుల్లో చేపట్టబోయో కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తడుకు సర్పంచ్ వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఆదిమండిడి, మోహన్, శంకర్, మోహన్ రాయల్ పాల్గొన్నారు.

వడమాలపేట: పాదిరేడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి దాముయాదవ్, టీడీపీ నాయకులు సతీష్, చందు, పంచాయతీ కార్యదర్శి హేమభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, సెప్టెంబరు 21: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊం జల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవింద నామ స్మరణల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలం కార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగిం చారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గురజాడ



పుత్తూరు టౌన్, సెప్టెంబరు 21: గురుజాడ అప్పారావు తన రచనల ద్వారా సామాజిక మార్పును, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన మహా నీయు డని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీరయ్య అన్నారు. శనివారం కళాశాలలో గురుజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు మన్యం నరసింహులు, వాణిశ్రీ, హరిబాబు, నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనేరు స్థలంలో కమర్షియల్ భవన నిర్మాణమా తొలగించండి : హైకోర్టు



నిర్మాణ దశలో ఉన్న భవనం

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 21: ఆలయ కోనేరు కోసం కేటాయించిన స్థలంలో కమర్షియల్ నిర్మాణం చేపట్టడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆరువారాల్లోగా భవన నిర్మాణాన్ని తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. పుత్తూరు కామాక్షి సమేత సదాశివ స్వామి దేవస్థానికి అనుబందంగా కోనేరు నిర్మాణం కోసం సర్వే నెంబర్ 197/2లో 60 సెంట్ల స్థలాన్ని రెవెన్యూ శాఖ దేవాదాయ శాఖకు అప్పగించింది. ప్రస్తుతం ఆ స్థలంలో కమర్షియల్ భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై 2023 జూన్ 19వ తేదీన టీడీపీ టౌన్ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు అమలుచేయని పక్షంలో కోర్టు ధిక్కారానికి పాల్పడినట్లు భావించాల్సి ఉంటుందని ఇందుకు బాధ్యుడైన మున్సిపల్ కమిషనర్ కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

తమిళనాడువాసి మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 21: మండలంలోని మూర్తిరెడ్డిపాళెం సమీపంలో తమిళనాడు వాసి పరమశివం (50) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... తమిళనాడుకు చెందిన పరమశివం గత కొద్దిరోజులుగా నాయుడుపేట పట్టణంలో మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మూర్తిరెడ్డిపాళెం సమీపంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృత దేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతిగా మద్యం తాగడం వల్ల మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 21: నాయుడుపేట బేరిపేటలో నివాసం ఉంటున్న లక్ష్మి(40) శుక్రవారం ఎలుకల మందు తిని అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందింది.

మార్కెట్ రుసుం వసూలుకు 28న వేలం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 21: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్, మాంసం, చేపల దుకాణాలు, రోడ్డు మార్జిన్ వెంబడి దుకాణదారుల నుంచి దినసరి రుసుం వసూలు చేసేందుకు లీజు హక్కులకు 28వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెళ్లకూరు, సెప్టెంబరు 21: మండలంలోని యడపూడి స్వర్ణముఖినది నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు వీఆర్వో వంశీకృష్ణ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

వెంకటగిరి, సెప్టెంబరు 21: వెంకటగిరి పట్టణంలో ఈ నెల 25,26 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో అమ్మవారి అత్తవారి ఇల్లుగా భావించే జీనిగలవారి వీధి, చాకలి మండపం నుంచి అమ్మవారి రథం తిరిగే ప్రధాన వీధుల్లో రోడ్డుపైకి వచ్చి ఆక్రమణలను శనివారం అధికారులు తొలిగించారు. సీఐ రమణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలిగించాలని, లేని పక్షంలో మున్సిపల్ అధికారులు తొలిగిస్తారని హెచ్చరించారు. జాతర జరిగే రెండు రోజుల పాటు అమ్మవారి రథం తిరగే రోడ్ల పక్కన చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతించబోమన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం





వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు - హాజరైన భక్తులు

చిట్టమూరు, సెప్టెంబర్ 21: మల్లాంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. వేదపండితులు నాదెండ్ల రామేశ్వర గురుకుల్, ప్రధానార్చకులు భాను ప్రకాష్‌శర్మ స్వామి వారి చరిత్రను పటిస్తూ కల్యాణ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధానార్చకులు భానుప్రకాష్‌శర్మ స్వామి అమ్మవార్లకు కంకణాలు కట్టి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి, సాహితి దంపతులతో పాటు ఉభయకర్తలు కల్యాణ వేదిక, పుష్పాలంకరణ, కానుకలను సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం తరపున అక్కడి వేద పండితులు పట్టు వస్త్రాలు, చందన విభూదిగంధ పరిమలాలతో కూడిన సుంగంధ ద్రవ్య పరిమళాలను సమర్పించారు. వళ్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలు వేసి ఆశీర్వాదం పొందారు. స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులకు స్వామి ఉత్తరీయం, చిత్రపటాలను బహూకరించారు. అనంతరం ప్రసాద వినియోగం, బ్రహ్మణ సమారాధన కార్యకలాపాలను ఉభయకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు కల్పించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణ సమయంలో సుమారు 70జంటలకు పైగా నూతన వధువరులు వివాహాలు చేసుకున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా దువ్వూరు హనుమంతరామిరెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు శేషురెడ్డి, రామరాఘవరెడ్డి, రామలింగారెడ్డి భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

నేడు వసంతోత్సవం

వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వసంతోత్సవం ఆదివారం జరగనుంది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన: పాశిం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

వాకాడు, సెప్టెంబరు 21: ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెంలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కూటమి నాయకులు, అధికారులతో కలసి ప్రారంభించారు. గతేడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ సమయంలో బాలిరెడ్డిపాళెం వద్ద తెగిపోయిన పొర్లుకట్ట, దెబ్బతిన్న వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం బాలిరెడ్డిపాళెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష నేరవేర్చేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటన, రూ.1000 పెంచి పించన్ల పంపిణీ, ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు, ధాన్యం కొనుగోలు బకాయిల విడుదల, స్థానిక సంస్థలకు నిధులు, అన్న క్యాంటీన్ల ప్రారంభం, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు వంటి కీలక నిర్ణయాలు వందరోజుల్లో తీసుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయబోతున్నట్లు తెలిపారు. 2014-2019 మధ్యకాలంలో పేదలు కట్టుకున్న ఇళ్లకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేశారని, ఆ లబ్ధిదారులందరికీ బిల్లులు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీరు, నాణ్యమైన విద్యుత్, రైతులకు సబ్సిడీ విత్తనాలు, మంచి ఆరోగ్యం, పాడిరైతులకు అవగాహన కల్పిస్తూ, గృహాల ఏర్పాటుకు కృషి లాంటివి చేయాలన్నారు. వాకాడు మండలంలో వందల ఎకరాలు ఆక్రమణకు గురికావడంతో తహసీల్దారు క్షుణ్ణంగా పరిశీలించి కబ్జాకు గురైన భూమిని పేదలకు పంచేలా చూస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కుంచం దయాకర్, చింతల మోహన్‌నాయుడు, పంత్రాంగం అరుణ్, బత్తిన ప్రమీల, తీపలపూడి రమణయ్య, కోటా శ్రీనివాసులు, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభం నుంచి సంక్షేమంలోకి: విజయశ్రీ



మానమాల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, సెప్టెంబరు 21: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచేనాటికి సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని వంద రోజుల్లో సంక్షేమంలోకి నడిపించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం మానమాలలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందరోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దోపిడీ, దౌర్జన్యాలు, అవినీతి, అధికార దుర్వినియోగంతో సాగిన పాలనకు చరమగీతం పాడుతూ ప్రజలు గొప్ప తీర్పు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వంలో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కూడా కల్తీ నెయ్యితో అపవిత్ర చేయడం వైసీపీ నేతల దుర్మార్గానికి పరాకాష్ట అని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో రజనీకాంత్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కొండలరావు, జిల్లా టీసీసెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్, నాయకులు గోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, కంకణాల సత్యవరప్రసాద్‌రావు, పాదర్తి ప్రకాశ్‌నాయుడు, ఖలీల్ పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

దొరవారిసత్రం, సెప్టెంబరు 21: దొరవారిసత్రం మండలం నెలబల్లి తెలుగుగంగ కాలువ వంతెన సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి బోల్తా పడింది. నెల్లూరు నగరానికి చెందిన రవికుమార్‌రెడ్డి దంపతులు తమ కుమార్తెను అమెరికాకు పంపించేందుకు చెన్నై ఏయిర్‌పోర్టుకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కారులో టైరు కనెక్టివ్ రాడు విరిగి పోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. రవికుమార్‌రెడ్డి దంపతులను కారులో ఇరుక్కుపోవడంతో గమనించిన స్థానిక టీ దుకాణం నిర్వాహకులు, అటువైపుగా వెళ్లే మినీ లారీ సిబ్బంది సాయంతో బయటకు తీశారు. రవికుమార్‌రెడ్డి దంపతులకు ఎటువంటి గాయాలు కాలేదు.

25న ప్రజావేదిక సభ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 21: స్థానిక రెండో పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో ఈనెల 25వ తేదీన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి సంబంధించి ప్రజావేదిక సభను నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం బీసీ కాలనీ సమీపంలో సభ ఏర్పాటు స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సభ వేదికగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రజలకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నటశేఖర్, శ్రీదేవి, హరిబాబు, లక్ష్మణరావు అశోక్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు విరాళం అందజేత

గూడూరు, సెప్టెంబరు 21: గూడూరుకు చెందిన జనసేన నాయకుడు మునిగిరీష్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం చేపడుతున్న సేవా కార్యక్రమాలకు రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు.

గురజాడకు నివాళి

చిల్లకూరు, సెప్టెంబరు 21: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురజాడ వెంకట అప్పారావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, ఆదిలక్ష్మీ, శ్రీనివాసులు, సంధ్య, సురేంద్ర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్లదిబ్బ పాఠశాలలో వర్క్‌షాప్

చిల్లకూరు, సెప్టెంబరు 21: మండలంలోని గుమ్మళ్లదిబ్బ ప్రాథమిక పాఠశాలలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య, పాఠశాలలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ వంటి అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రాజేష్ రంజన్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మహాజన సభ

పెళ్లకూరు, సెప్టెంబరు 21: మండల కేంద్రమైన పెళ్లకూరులోని చిల్లకూరు పీఏసీఎస్ మహాజన సభ ఆ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ఇన్‌చార్జి సీఈవో రవీంద్రయ్య మాట్లాడుతూ సంఘం సభ్యులు తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రెండు ఫొటోలు ఇవ్వాలని, లేదంటే సంఘం నుంచి తొలిగించడం జరుగుతుందన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనకు మెరుగైన వసతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెంచలయ్య

గూడూరు, సెప్టెంబరు 21: తమ కళాశాలలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు బహుళజాతి కంపెనీల సహకారంతో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఆదిశంకర కళాశాల చైర్మన్ పెంచలయ్య తెలిపారు. శనివారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విశాఖపట్నానికి చెందిన డెమి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సహకారంతో ఏర్పాటు చేసిన కాంపిటేటివ్ ప్రోగామింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. కాంపిటేటివ్ ప్రోగామింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థితికి చేరుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచు కోవాలన్నారు. కార్యక్రమంలో అవినాష్, ఛార్లెస్ గాడ్విన్, అభినయ ఇలాంగోవన్, వేణుమాదవ్, రాజయ్య, పవన్‌కుమార్, వంకి అనూష, రామయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట కమిషనర్‌గా చిన్నయ్య

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21: సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌గా కె.చిన్నయ్య నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ బదిలీపై ఆత్మకూరుకు వెళ్లిన విషయం తెలిసిందే. గురజాల నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యను సూళ్లూరుపేట కమిషనర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు

గూడూరు, సెప్టెంబరు 21: స్థానిక ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ శనివారం ముగిశాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారిని మండలస్థాయి జట్లకు ఎంపిక చేయడం జరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు 26వ తేదీన కోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న నియోజవర్గస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కరీముల్లాఖాన్, వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, శివకుమార్ పాల్గొన్నారు.

కోట: స్థానిక అల్లూరెడ్డి వెంకటకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు అండర్-14, అండర్-16 విభాగాల్లో కబడ్డీ, చెస్, రన్నింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. మండలస్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

చిల్లకూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17, గురుకుల పాఠశాలలో అండర్-19 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, టెన్నీకాయిట్, బాల్‌బ్యాడ్మిటన్, అథ్లెటిక్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీలు శ్రీనివాసులు, శిరీష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, మల్లికార్జున్‌రావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో నియోజకవర్గ క్రీడా పోటీలు

కోట, సెప్టెంబరు 21: కోటలోని అల్లూరెడ్డి వెంకటకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 26, 27 తేదీల్లో నియోజవర్గస్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని ఎంఈవో మస్తానయ్య శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మిక్సిడ్‌కాలనీ, శంకరన్ గిరిజనకాలనీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. రూ.3వేలు ఉన్న పెన్షన్‌ను రూ.1000 పెంచి రూ.4వేలు ఒకటో తేదీన ఇంటి వద్దకే అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. విజయవాడలో వరదల సమయంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టిన సమర్థవంతమైన నేత చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో కొండా రామచంద్రారెడ్డి, దాసరి రామ్‌ప్రసాద్, రాజేంద్ర, మధు, సుబ్బయ్య, సురేష్‌బాబు, బాలరమణయ్య, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలన



మన్నారుపోలూరు గిరిజన కాలనీవాసులతో టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21: రాష్ట్రంలో రాక్షస పాలనపోయి ప్రజాపాలన వచ్చి వంద రోజులు పూర్తయిందని నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కొండలరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం మన్నారు పోలూరు గిరిజన కాలనీల్లో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు మాధవ నాయుడు, నాయకులు వాకచర్ల రమేష్, మునస్వామి, ఎం.వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య యుగంధర్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో గురుకులానికి తాగునీరు

నాయుడుపేట, సెప్టెంబరు 21: నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ఆర్థిక చేయూతతో తాగునీటి సమస్య పరిష్కారం అయిందని ప్రిన్సిపాల్ దాదాపీర్ తెలిపారు. ఇటీవల గురుకులంలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో సెప్టిక్ ట్యాంక్ పక్కన ఉన్న బోరునీటి సరఫరాను నిలిపివేశారు. ప్రతిరోజు రూ.800 వ్యయంతో మినరల్ వాటర్ అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుడు శేఖర్‌బాబు దయాకర్‌రెడ్డికి విషయం తెలియజేయడంతో ఆయన స్వర్ణముఖినదిలో మరమ్మతులకు గురైన బోరును రిపేరు చేయించడంతో పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేశారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష వద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నవజీవన్ నిర్వాహకుడు బాలాజి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21: హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని నవజీవన్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు ఆర్‌కే.బాలాజి అన్నారు. శనివారం స్థానిక సత్యం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ సోకిన వారిని ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారితో కలిసి ఉండడం, భోజనం చేయడం వల్ల హెచ్‌ఐవీ సోకదన్నారు. హెచ్‌ఐవీ సోకకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గిరిరెడ్డి, నవజీవన్ ఆర్గనైజేషన్ సిబ్బంది మంజుల, నందిని, శ్రీవల్లీ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన కేశినేని



ఏర్పేడు, సెప్టెంబరు 21: మంత్రి నారా లోకేశ్‌ను ఏర్పేడు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కేశినేని సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏర్పేడు మండల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అదేవిధంగా కందాడు పంచాయతీకి నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం లోకేశ్‌కు ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు.

కళత్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

వరదయ్యపాళెం, సెప్టెంబరు 21: మండలంలోని కళత్తూరు పంచాయతీ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ తెప్పల బాలయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు పీడీ శ్రీనివాసప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారని ఏపీవో గణేష్ తెలిపారు. వివిధ కంపెనీల్లో విధులకు వెళుతున్న 28మంది కార్మికుల పేరిట పనులు చేసినట్లు మస్టర్లు సృష్టించి నిధులు దుర్వినియోగం చేశారని అదే గ్రామానికి చెందిన నాగరాజు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. గత ఆగస్టు 23న ఏపీడీ, స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో విచారణాధికారుల బృందం కళత్తూరులో గ్రామసభను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో అక్రమాలు నిజమేనని తేలింది. ఈ క్రమంలో ఆయన్ను సస్పెండ్ చేశారు. దీనిపై పదిరోజుల్లో వివరణ ఇవ్వాలని బాలయ్యకు నోటీసులు జారీ చేశారు.

విద్యుత్ షాక్‌తో రైల్వే ఉద్యోగి మృతి



భరత్

రేణిగుంట, సెప్టెంబరు 21: విద్యుదాఘాతంతో రైల్వే ఉద్యోగి మృతి చెందిన ఘటన శనివారం ఉదయం రైల్వేక్వార్టర్స్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..రేణిగుంట రైల్వే ఎలక్ట్రికల్ శాఖలో ఉద్యోగం చేస్తున్న భరత్(27) విధుల్లో భాగంగా రైల్వే క్వార్టర్స్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృత దేహాన్ని పంచనామా నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొండమానుపురం ఆలయంలో శ్రీవారి లడ్డు



లడ్డుప్రసాదాన్ని తీసుకుంటున్న భక్తులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: శ్రీకాళ హస్తి మండలం తొండమానుపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత అభయ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనంతో నిండి పోయింది. పెరటాసి మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కాగా ఆలయంలో తిరుమల శ్రీవారి లడ్డును టీటీడీ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ధర రూ.50గా నిర్ణయించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

విద్యా సామగ్రి పంపిణీ



ఏర్పేడు, సెప్టెంబరు 21: మండలంలోని గోవిందవరం పంచాయతీ పిళ్లారిగుంట గిరిజనకాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీడీపీ సీనియర్ నేత కల్లూరు రంగయ్య శనివారం విద్యా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేరం చిరంజీవులు నాయుడు, కృష్ణప్ప మొదలియార్, సీతాపతి ఆచారి, పాడేటి బాలకృష్ణ జోగి, వెంకటరమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్స వాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, కూనాటి నాగరాజు, చలమయ్య, పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

చట్టం ఎవరినీ వదిలిపెట్టదు

కేవీబీపురం, సెప్టెంబరు 21: చట్టం ఎవరినీ వదిలిపెట్టదని ఎస్‌ఐ వీరాంజనేయులు స్పష్టంచేశారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల మహిళల మెడల్లో బంగారు దోచుకోవడం ఎక్కు వైందన్నారు. ఒంటరి మహిళలు బంగారు ఆభరణాలు ధరించిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఇటీవల పెరిందేశం, రాగిగుంట గ్రామాల మధ్య జరిగిన గొడవల్లో కొంతమందిపె కేసులు నమోదు చేశా మని నిందితులు లొంగిపోవాలని కోరారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 21: చంటి బిడ్డలకు 12 రకాల టీకాలను క్రమంతప్పకుండా వేయించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండలంలోని వేణుగోపాలపురం యానాది కాలనీలోని గర్భిణులకు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై శనివారం అవగాహన కల్పించారు. టీకాలు వేయించడం వల్ల పిల్లలు వ్యాధుల బారినపడకుంటా ఉంటారని తెలియజేశారు.

రాష్ట్రంలో ప్రజారంజక ప్రభుత్వం : సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాంధీవీధిలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజావేదికను నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఆర్థికంగా రాష్ట్రాన్ని అతాలకుతలం చేసినా సీఎం చంద్రబాబు ఎంతో క్రమశిక్షణతో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీనే ఇంటివద్దకే పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. మెగా డీఎస్సీ, ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజాపాలన సాగిస్తున్నారని వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి పాలన విజయాలపై అవగాహన కల్పిస్తూ ఇదిమంచి ప్రభుత్వం అనే స్టిక్కర్‌ను అంటిచారు. ఈ కార్యక్రమలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, పట్టణాధ్యక్షులు విజయకుమార్, నాయకులు మునిరాజానాయుడు, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెయ్యి కల్తీ దోషులను బహిరంగంగా శిక్షించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నకోలా ఆనంద్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: తిరుమల లడ్డు ప్రసాదం కల్తీ విషయంలో దోషులను బహిరంగంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల శ్రీవారి ప్రసాదాల్లో పశువుల కొవ్వు, పంది కొవ్వు, చేపలనూనెలు, పామాయిల్ వంటి వాటిని వాడటం బాధాకరమన్నారు. దీనిపై సమగ్ర విచారణచేసి అప్పటి పాలక మండలి చైర్మన్లు, ఈవో, మాజీ సీఎం జగన్‌ను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరిక పాటి రమేష్‌బాబు, ఎస్వీ రమణ, కొండేటి గోపాల్, వేడం కృష్ణయ్య, అబ్బూరి పుల్లయ్యనాయుడు, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ



నారాయణవనం, సెప్టెంబరు 21: నారాయణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల్‌సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు చేశాచారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య ఊంజల్ సేవ జరిపించారు. పెద్దఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా భవనాలను కూల్చడం దారుణం

ఏర్పేడు, సెప్టెంబరు 21: ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్మిస్తే ముం దస్తుగా నోటీసులు అందించి అక్రమకట్టడాలను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ అఖిల భారత యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి కోరారు. మండలంలోని వికృతమాల రెవెన్యూ పరిధిలో ఒక దళిత నేత నిర్మించిన కట్టడాన్ని అధికారులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం బాధాకరమన్నారు. శనివారం ఆయన ఆ ప్రదేశాన్ని పరిశీలించారు.

మత్తుకు దూరంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 21: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పలు విషయాలపై శనివారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తగా రోడ్డు ఏర్పాటు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 21: మండలంలోని కాంపాళెం దళితవాడలో సర్పంచ్ మాచాలమ్మ శనివారం మట్టిరోడ్డును ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి గంగమ్మ చెట్టునుంచి ఉత్తర దళితవాడకు ఈ రోడ్డును వేయిస్తున్నట్లు చెప్పారు. తర్వలోనే సిమెంట్ రోడ్డును కూడా నిర్మిస్తామని సర్పంచ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లగేజీ ఆటో

రేణిగుంట, సెప్టెంబరు 21: ఆర్టీసీ బస్సును లగేజీ ఆటో ఢీకొంది. ప్రయాణికుల కథనం మేరకు.. శనివారం శ్రీకాళహస్తి నుంచి తిరుమలకు ఓ ఆర్టీసీ బస్సు బయలుదేరింది. తిరుపతి నుంచి రేణిగుంట వైపు ఖాళీ లగేజీ ఆటో వెళుతోంది. రేణిగుంట మోపెడ్స్ వద్ద ఆటో ముందు వెళుతున్న వాహ నాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొంది. బస్సులోని ప్రయాణి కులకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రయాణికులను మరో బస్సులో తిరుమలకు పంపారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి



ఎంఈవో భువనేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎంఈవో భువనేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణాధ్యక్షుడు గురవయ్య మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఆదివారాలు కూడా తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, శశి, ముని, గణేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లం ఉన్నత పాఠశాలల్లో స్వచ్ఛతా హి సేవ



ఏర్పేడు, సెప్టెంబరు 21: పల్లం జడ్పీఉన్నత పాఠశాలలో తిరుపతి ఐఐటీ నోడల్ ఆఫీసర్ చైతన్య, జవీ సుబ్బారెడ్డి, వెంకటరమణ, మహేష్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాపరికరాలను ఇచ్చారు. పాఠశాల ఆవరణలో ఐఐటీ విద్యార్థులు మొక్కలు నాటారు.

మలయ పెరుమాళ్‌కు పూజలు

పిచ్చాటూరు, సెప్టెంబరు 21: పిచ్చాటూరులోని మలయ పెరుమాళ్ ఆలయంలో పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం యువకులు కోలాటం వేశారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్ధశి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకస్వామి ఆలయం వద్ద శనివారం సంకట చతుర్ధశిని పురస్కరించుకుని శాస్త్రో క్తంగా పూజలు నిర్వహించారు. కలశ స్థాపన పూజ, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అభిషేకం చేశారు.

భక్తులతో కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: శ్రీకాళహస్తీశ్వ రాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పనిముట్లు ఇవ్వాలని పీడీకి వినతి



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 21: పారలు, గడ్డపారలు వంటి పనిముట్లు ఇవ్వాలని ఉపాధి కూలీలు పీడీ శ్రీనివాసప్రసాద్‌ను కోరారు. శనివారం మండలంలోని వీఎప్పురం గ్రామంలో చేపట్టిన చెరువు పను లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు పనిముట్లు ఇవ్వా లని ఆయనకు విన్నవించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భానుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో సాగుతున్న కూటమి పాలన

పిచ్చాటూరు, సెప్టెంబరు 21: అభివృద్ధి, సంక్షేమంతో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. అడవికొడియంబేడు, కారూరు, ఎస్‌ఎస్‌బీ పేట, కీళపూడి, రెప్పాలపట్టు, నీరువాయి, వెంగళత్తూరు, ముడియూరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు. వందరోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేశారు. ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మేలు కలుగుతుందని తెలియజేశారు.

ఆధునిక భాషకు అడుగుజాడ గురజాడ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 21: ఆధునిక సాహిత్యానికి అడుగుజాడగా గురజాడ అప్పారావు నిలిచారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి తెలిపారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో శనివారం గురుజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ వర్మ, అధ్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు, గంగారామ్, పరంధామయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురజాడకు నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్, హెచ్‌ఎం భువనేశ్వరి, ఉపాధ్యాయులు దేవరాజులు, వెంకటేశ్వర్లు, ఉషారాణి, శ్రీహరి, సూర్యనారాయణ పాల్గొన్నారు. ● పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో గురజాడకు అంజలి ఘటించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగ కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో, ఏర్పేడు మండలం పాతవీరాపురం పాఠశాలలో గురుజాడకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వైసీపీ



ఈ పాపాలు ఊరికే పోవు

వైసీపీ ప్రభుత్వం హిందూ ఆలయాల ప్రతిష్టను మంటగలిపేలా వ్యవహరించింది. చివరికి శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసింది. వీరు చేసిన పాపాలు ఊరికే పోవు. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలి.

- పామాంజి. వాసు, వెంకటేశ్వరస్వామి భక్తుడు, సత్యవేడు



ల్యాబ్ నివేదిక ఆపాలని కోరడం విడ్డూరం

ఈ అపచారంతో వైసీపీ నాయకుల అంతానికి అంతిమ ఘడియలు మొదలయ్యాయి. ధర్మారెడ్డి, సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ల్యాబ్ నివేదిక ఆపాలని కోర్టుకు వెళ్లడం విడ్డూరంగా ఉంది.

- తులసీరామ్, తెలుగు యువత అధికార ప్రతినిధి



పక్కా ఆధారాలున్నాయి.. తప్పించుకోలేరు

నెయ్యి కల్తీ జరిగిందని పూర్తి ఆధారాలతో నిర్ధారించాకే ప్రభుత్వం బయటకు చెప్పింది. ఇక జగన్ అండ్‌కో తప్పించుకోలేరు. ఆ శ్రీనివాసుడు వీళ్లను తప్పకుండా శిక్షిస్తాడు.

- పృథ్వీరాజ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రపంచ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్న తిరుమల లడ్డు కల్తీ వివాదంపై పలువురు స్పందించారు. యావత్ హిందూ ప్రపంచం అత్యంత పవిత్రంగా భావించే తిరుమల లడ్డూలో జంతువుల నూనెలు కలపడంపై మండి పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. ప్రధానంగా అప్పటి ఈవో, చైర్మన్‌లు, సీఎంలపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. **- సత్యవేడు**



సీబీఐతో విచారణ జరిపించాలి

హిందువులు పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో అప్పటి జగన్ ప్రభుత్వం కమిషన్లకు కక్కుర్తిపడి జంతు అవశేషాలు కలిగిన నాసిరకం నెయ్యిని వాడి క్షమించరాని అపచారం చేసింది. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై సీబీఐతో విచారణ జరిపించాలి. బాధ్యులను శిక్షించాలి.

- మునిప్రతాప్, బీజేపీ సత్యవేడు మండల అధ్యక్షుడు